



# కథ రాయడానికి ముందే రచయితకు స్పష్టత కావాలి!

**- ఇచ్ఛాపురపు జగన్నాథరావు**

కలకత్తా, ముంబై, ఢిల్లీ, మద్రాసు వంటి మహానగరాలలో 28 ఏళ్ల పాటు ఉద్యోగంలో భాగంగా వుండి 300 కథలు, వ్యాసాలు, 6 నవలలు, పాతిక రేడియో నాటకాలు రాసినా తెలుగు సాహిత్యాన్ని సంతృప్తిగా చదవలేదంటారు ఇచ్ఛాపురపు జగన్నాథరావు. కథలో ప్లాటు 40 శాతం వుంటే మానసిక విశ్లేషణ 60 శాతం ఉండాలంటారు. రాసిన 20 ఏళ్ల తర్వాత ఆయన కథలు కళాసాగర్ వారి కథాసాగరం, తెలుగు విశ్వవిద్యాలయం వారి నూరేళ్ల తెలుగు కథా సమాహారంలో చోటు చేసుకోవడం ఆయన కథకున్న ఆయుష్షును తెలియచేస్తాయి. కస్టమ్స్ అప్పిలేటులో జడ్జిగా పదవీ విరమణచేసిన 79 ఏళ్ల జగన్నాథరావుకి కథలో వచ్చే ఆ ప్రాంత జాగ్రఫీ, మనుషులు, పద్ధతుల్ని అర్థం చేసుకుని రాయటం ఇష్టం. వారి ఇంటర్వ్యూ ఈవారం...



భార్య స్వరలక్ష్మితో...

''కథ పుట్టాలంటే ఓ ట్రిగ్గర్ కావాలి, ఓ కంపన ఉండాలి. కలకాలం నిలవాలంటే ఆ కథకో అంత ర్గత విలువ (Intrinsic Value) ఉండాలి''

– ఇచ్ఛాపురపు జగన్నాథరావు

1931 అక్టోబర్ 19న, ఆ రోజు మహర్నవమి నాడు నర్సీపట్నంలో పుట్టాను. అప్పట్లో అదో పది వేల జనాభా వున్న వూరనుకోండి, గ్రామమను కోండి. మాది పెద్ద కుటుంబం. ఓ సనాతన కుటుంబం. మా నాన్నగారో తెలుగు మాస్టారు. బెత్తం లేకుండా పాఠాలు చెప్పిన మనిషి. అప్పట్లో మా ఊళ్లో స్కూలు ఫైనలు వరకే వుండేది. కాలేజీ చదువు కోసం వేరే వూరు వెళ్లాలి. అంత స్తోమత మాకు లేదప్పుడు. చూడండి! కొన్ని విచిత్రాలు ఎలా వుంటాయో! సత్యనారాయణ పట్నాయక్‌గా రనే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మా నాన్నగారికో సలహా ఇచ్చారు. మీ వాడిని పోనీ సెకండరీ స్కూల్ గ్రేడ్ టీచర్ ట్రెయినింగ్‌కి పంపించండి. సీటు నేను ఏర్పాటు చేస్తాను అన్నారు. అప్పటికి ఆ కోర్సు మొదలై నెలరోజులు దాటి పోయింది. ఆ మహాను భావుడి చలవ వలన కోర్సులో సీటొచ్చింది. అదృ ష్టవశాత్తూ నాకు స్కూల్‌ఫైనల్‌లో మంచి మార్కు లొచ్చాయి. ఇంకో గమ్మత్తేమిటంటే అప్పట్లో టీచర్ల అవసరం చాలా వుండేది. దాంతోటి ఆ కోర్సుని రెండు సంవత్సరాల నుంచి సంవత్సరానికి కుదిం చారు. దానివల్ల 16 సంవత్సరాలు నిండేటప్పటికి ఆ కోర్సు పూర్తి చేయ గలిగాను. నేను చదువుకున్న ఎలిమెంటరీస్కూల్‌కే హెడ్మాస్టర్‌గా వెళ్లాను. జీవి తంలో ఐరనీ (Irony) ఎలా వుంటుందో చూడండి. నాకు చదువు చెప్పిన గురువులకే సంవత్సరం పాటు హెడ్మాస్టర్‌గా వున్నాను. 1947వ సంవ త్సరం సెప్టెంబర్ 9వ తారీఖున నేను చేరాను. కొన్నిసార్లు భగవంతుడు కొన్ని నిర్ణయాలు ముందే చేస్తాడనిపిస్తుంది. భవిష్యత్తులో చాలా జటిలమైన కస్టమ్స్ శాఖలో అధికారిగా పని చేయటానికి ముందే ఇతరులను నొప్పించకుండా పని చేయం చటం అన్నది అక్కడ నేర్చుకున్నాను. ఎందు కంటే వాళ్లందరూ నా గురువులు. ఇలాంటిదే నా జీవితం తర్వాత దశలో జరిగింది. నేను కస్టమ్స్ అప్పిలేట్‌లో జడ్జిగా వున్నప్పుడు, నా పైన రెండు మూడు అంచెల్లో వుండే అధికారులు రిటైర్ అయి కన్సల్టెం ట్లుగా వచ్చి వాదనలు విన్పించటం కోసం ఎదురు చూస్తూ ఉండే వాళ్లు. ఇది నేను గొప్పగా చెప్పుకో వటం లేదు. ఒకప్పుడు వాళ్లని కలుసుకోవడం కోసం వారి కార్యాలయాల్లో పడిగాపులు పడుతూ వుండే వాడిని. ఇలాంటి irony, surprise కథ లకు మంచి నేపథ్యమవుతుంది. మళ్లీ వెనక్కు వస్తాను. ఒక సంవత్సరం హెడ్మాస్టర్‌గా పనిచేసిన తర్వాత హైస్కూల్‌కు బదిలీ అయి అక్కడ నాలు గేళ్ల అంటే 51 వరకు టీచర్‌గా పని చేశాను. అలా చేస్తూనే ఇంటర్మీడియేట్ ప్రైవేట్‌గా రాశాను. 56లోగా ఇంట్లో పరిస్థితులు కుదుటబడి మళ్లీ చదువుకునే అవకాశం వచ్చింది. ఇంటర్మీడియేట్ ఆ యేడు 30,000 మంది రాస్తే 30 ఫస్ట్ క్లాసులొ చ్చాయి. నాకు జ్ఞాపకమున్నంత వరకు నాది ఆర్ట్స్ కాబట్టి ఆర్ట్స్‌లో ఫస్ట్ క్లాసులు ఒకే ఒకటి వచ్చింది. ఆ ఒక్కటి నాది కావటం నాకిప్పటికీ గొప్పగానే అన్పిస్తుంది. అప్పట్లో ఆంధ్రా యూనివర్సిటీలో బి.ఎ. (ఆనర్స్) కోర్సు వుండేది. మూడేళ్ల కోర్సు. అయితే ప్రత్యేకత ఏమిటంటే అది ఎం.ఎ.కి సమా నంగా వుండేది. అది దాని మంచి లక్షణ మయితే కనీసం 35 శాతం మార్కులు రాకపోతే మళ్లీ మొదటి నుంచి మొదలు పెట్టాలి. ఒక వైకుంఠపాళీలాంటిదన్న మాట.

### అప్పట్లో ఔదార్యం

ఆంధ్రా యూనివర్సిటీలో బి.ఎ. (ఆనర్స్) ఇంగ్లీషులో చేరాను. ఈలోగా చాలామంది సలహా ఇచ్చారు. ఎకన మిక్స్ ఆనర్సుకి ఎక్కువ భవిష్యత్తు ఉంటుందని. ఆ రోజుల్లో చాలా గొప్ప గొప్పవాళ్లు ఆంధ్రా యూనివర్సిటీలో వుండేవాళ్లు. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత వైస్ ఛాన్సలర్‌గా వచ్చిన వి.ఎస్.కృష్ణ బాగా చదువుకున్న వాళ్లని యూనివర్సి టీకి రప్పించే వాడు. ఎకనమిక్స్ హెడ్‌గా వున్న ఎం.హెచ్.గోపాల్ కర్నా టకకు చెందిన వాడు. లండన్‌లో చదు వుకుని వచ్చినవాడు. చాలా స్టైలిష్‌గా వుండే వాడు. నాకు ఎకనమిక్స్‌లో సీటు కావాలంటే ముందు కుదరదన్నా, నా మార్కులు అవీ తెలుసుకుని ప్రైవే ట్‌గా చదువుకున్నందుకు ముచ్చటపడి వెంటనే ఫైల్ పట్టుకుని వి.సి. దగ్గరకు వెళ్లి అవసరమయితే సెనేట్ పర్మిషన్ తీసుకుందామని ఒప్పించి నాకు సీటిప్పించాడు. ఇదంతా వెళ్లి మీ ఇంగ్లీష్ హెడ్‌కు చెప్పు అని నన్ను గైడ్ చేశాడు. ఎందుకంటే ఇంగ్లీష్ హెడ్ శ్రీనివాస అయ్యంగార్ అని ఇంకో గొప్ప వ్యక్తి. బహుశా ఇలాంటివి ఇప్పుడు సాధ్యపడ వేమో. బి.ఎ. (ఆనర్స్)లో నేను గోల్డ్ మెడలిస్ట్‌ని. వెంటనే అనకాపల్లి కాలేజీలో ఎకనమిక్సు లెక్చర ర్‌గా చేరాను. అక్కడే ఐఎఎస్ పరీక్ష రాశాను. ఒక్క ర్యాంకులో ఐఎఎస్ చేజారిపోయింది. కస్టమ్స్ సర్వీస్ సెలెక్షన్ వచ్చింది. రాలేదన్న బాధేమీ లేదు. ఒక్క రాష్ట్రానికి కట్టుబడి వుండకుండా దేశమంతా తిరిగాను. ధనుష్కోడి మొదలు ఢిల్లీ వరకు అనేక చోట్ల పని చేశాను.

### ధనుష్కోడి అనుభవం

అప్పట్లో సిలోన్ (ఇప్పటి శ్రీలంక) నుంచి రోజూ ఒక బోటు వస్తూ వుండేది. అది సిలోన్ నుంచి ఇండియాకి తక్కువ దూరంలో వున్న ప్రదేశం. అక్కడే రెండేళ్లు వున్నాను. నేను వచ్చేసిన 6 నెలలకో, సంవత్సరానికో మునిగిపోయింది కూడా. ఇంతకీ ఆ బోటులో చాలా మంది సిలో న్‌లో వుండే ఇండియన్స్ తిరిగి వచ్చేస్తూ వుండే వాళ్లు. అదే కాకుండా కొద్ది మొత్తంలో ఎగుమతి దిగుమతులు అవుతూ వుండేవి. ఇక మాకు ముఖ్య మైన పని అక్కడ గోల్డ్ స్మగ్లింగ్ జరుగుతూ వుండేది. దాన్ని నిరోధించటం. అప్పట్లో అక్కడ రోడ్లు వుండేవి కావు. ఓ ఎనభై గుడిసెల్లాంటివి వుండేవి. మా ఆఫీసు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం కలిసి వుండేవి. అమావాస్య, పౌర్ణమిలకు వచ్చే ఆటుపో ట్లతో గల్ఫ్ ఆఫ్ మన్నార్, పాక్ స్ట్రెయిట్స్ కలిసి



హెడ్మాస్టర్‌గా...

## ఇష్టాలు

| | | |
|---|---|---|
| నచ్చిన కవి | : | బమ్మెర పోతనామాత్యుడు |
| రచయిత | : | సోమర్‌సెట్ మామ్<br>కుటుంబరావు |
| సినిమా | : | బాపు సినిమాలంటే ఇష్టం |
| నటుడు | : | ఎస్.వి.రంగారావు |
| నటి | : | సావిత్రి |
| గాయకుడు | : | ఘంటసాల |
| గాయని | : | భక్తిలోంచి సంగీతాన్ని జనింపచేసిన<br>ఎం.ఎస్.సుబ్బలక్ష్మి |
| నచ్చిన పాట | : | సుహానీరాత్ ఢల్ చుకే ('దులారి' హిందీ చిత్రం 1949) |
| సంగీత దర్శకుడు | : | నౌషాద్ |

పోతూ వుండేవి. ఇంకేముంది ఇల్లంతా జలమయం. చివరకి రోజూ అవసరమయ్యే మంచినీళ్లు మాకు రైల్వే వాళ్లు ట్యాంకర్ ద్వారా రామేశ్వరం నుంచి తెప్పించి ఇస్తూ వుండేవాళ్లు. ఇక పాంబన్ బ్రిడ్జి ధనుష్కోడి-రాంనాడ్‌కి మధ్య వుండేది. బయట ప్రపంచానికి లింకు బ్యాటరీతో పనిచేసే రేడియోనే! చుట్టుపక్కల ఎక్కడా చెట్లు అనేవి ఏవీ లేకపోవటం వలన గాలిలో ఆక్సిజన్ తక్కువగా వుండేది. మొత్తం 80 శాతం వూరంతా సముద్రమే! నా ఉద్యోగపర్వం మొత్తంలో ఎక్కువభాగం మహానగరాలలో గడిచింది. మద్రాసులో 11 ఏళ్లు, కలకత్తాలో 6 ఏళ్లు, ముంబైలో 3 ఏళ్లు, ఢిల్లీలో 8 ఏళ్లు పని చేశాను. ఇవి కాకుండా అలహాబాదు, ఆగ్రా, కేరళలో కొద్ది కాలంపాటు పని చేశాను. ఆంధ్రాలో ఒక్క గుంటూరులో మాత్రం 6 నెలలు కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా చేయటం జరిగింది.

### కథలకు మెట్రో నగరాల నేపథ్యం


నాకు పుస్తకాలతో పరిచయం అనేది నర్సీపట్నంలో హైస్కూలు రోజుల్నించి మొదలైంది. అప్పట్లో నర్సీపట్నంలో 'అలెగ్జాండ్రా' అని ఓ క్లబ్ వుండేది. ఇది 45 నాటి మాట. తెల్లవాళ్ల కాలం కాబట్టి ఓ తెల్లదొర పేరుతో వుండేది. ఆ రోజుల్లో క్లబ్ అంటే ఓ టెన్నిస్ కోర్టు, ఇంగ్లీష్ నవల్స్, న్యూస్ పేపర్లూ అవీ వుంటూండేవి. తెలుగు పత్రికలు అంతగా వచ్చేవి కావు. అప్పట్లో వచ్చే పత్రికల్లో ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, తెలుగు స్వతంత్ర, భారతి, చిత్రగుప్త, రూపవాణి సినిమా పత్రిక ఇవి ముఖ్య మైనవి. 47 ప్రాంతం నాటికి నేను వీటిల్లో చిన్న చిన్నగా రాస్తూండే వాడిని, ఓ పక్క ఉద్యోగం వెలగబెడుతూ. అయితే కలకత్తాకు 66లో వెళ్లిన తర్వాత ఎక్కువ కథలు రాశాను. కథ రాయటానికి ఓ కంపన కావాలి. ఓ టచింగ్ ఆఫ్ కావాలి. అది నేను కలకత్తాలో ఎక్కువ పొందాను. ప్రస్తుతం సాహిత్య రంగానికి దూరమెందుకయ్యానంటే...

ఎక్కడో ఆ సరదాపోవటం కారణం అనుకుంటాను. సాధారణంగా మొదట్లో అచ్చులో పేరు చూసుకోవాలని, అందరూ 'ఆహా' అనాలని ఓ కోరిక వుండేది. ఆ థ్రిల్లు కోసం రాశాను. రెండో స్టేజిలో ఎడిటర్స్ కోసం రాశాను. ఆంధ్రజ్యోతి పురాణం సుబ్రమణ్యశర్మ నా చేత ఎన్ని కథలు రాయించారో! ఆయన నాచేత వీక్లీ కాలమ్స్ కూడా రాయించారు. సంపాదకుడికి రచయిత కూడా ముఖ్యం. సంపాదకుడు మీ కథ ఫలానా రోజుకి కావాలని ఫోన్ చేస్తే, దాన్నో రాజాజ్ఞలా భావించే వాళ్లం. కథలు కూడా అలాగే వచ్చేవి. మాట్లైంలో తెనాలి నుంచి హితశ్రీ మంచి కథలు రాసేవాడు. అలాగే అమరేంద్ర కూడా. తర్వాత్తర్వాత అతను రాయటం తగ్గించి నట్లున్నాడు. వీళ్లిద్దరూ యూనివర్సిటీలో సమకాలీకులు. ప్రేమ అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిదయితే రచన అనేది ఒక్క వ్యక్తికే పరిమితం. కథకు మీ ల్యాబ్ ఏదీ అంటే మీ గుండె. నలుగురు కలిసి డిస్కస్ చేసి కథ రాసే పద్ధతి వుండదండి. ఉన్నా నా పద్ధతి అది కాదు. నా కథల్లో ఖరీదైన వాతావరణం ఎందుకుంటుందంటే...

నాకొక స్ట్రాంగ్ ప్రిన్సిపుల్ వుందండి. నాకు తెలియనిదాని గురించి నేను రాయనండి. నేను కథలో రాసిన ప్రతి జాగ్రఫీ కరెక్టుగా వుంటుంది, ఎవరయినా నేను కథలో రాసిన ప్రదేశానికి వెళితే పోల్చి చూసుకోవాలి. చూసుకుంటే 'కరెక్ట్' అనిపించాలి. ఒక కథ కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ బ్యాక్‌గ్రౌండ్‌తో రాశాను. అక్కడి చెట్లకు నంబర్లుండేవి. ఫలానా చెట్టు కింద వాళ్లు కూర్చున్నారని రాస్తే ఆ నంబరు చెట్టు ఉండి తీరాలి. అలా రాయడం నాకు అలవాటు. ఇక ఖరీదైన వాతావరణం అంటారా... మంచిదే కదా. పాఠకుడికి కూడా ఆ కోరిక కలగాలి. కుగ్రామంలో పుట్టి, పెద్ద కుటుంబంలో పుట్టి ఆర్థిక స్తోమత లేకపోయినా నేనీ స్థితికి వచ్చాను, నేనెలా కావాలనుకున్నానో అలానే అయ్యాను. నాలాగే ప్రతి ఒక్కరూ పెద్ద స్థితికి రావాలని ఆశ. కోరిక. అందుకే రాస్తాను.కథ ఎలా వుండాలి?నాకు అర్థం కాని విషయం... కేవలం ఎక్స్‌ప్లాయిటేషన్ గురించి రాస్తే ఆ సమస్య పోతుందా? కన్యాశుల్కాన్నే తీసుకోండి. ఆ నాటకం వచ్చిన 10 సంవత్సరాలకే కన్యాశుల్కం కనుమరుగయింది. కానీ నాటకం నిలిచి పోయింది. అంటే రచనతో అంతర్గతమయిన విలువ అంటే Intrinsic Value ఉండాలి. కథలో విలువ ఉండాలి. ఇది నా థియరీ మాత్రమే! మొట్టమొదట చదివించే గుణముండాలి. ఒక చిన్న పాయింట్ వుండాలి. దండలో దారంలా ఒక ఆధారంలా వుండాలి. దాని బట్టి అల్లికుండాలి. కథలో మొదట అక్షరాన్ని రాసేటప్పుడు ఈ కథ ద్వారా నేనేం చెప్పబోతున్నానన్న క్లారిటీ వుండాలి. అది లేకపోతే నేను రాయలేను. ఇంగ్లీషులో ఒక కొటేషనుంది. You need not tell the entire truth. You should tell a sliver of truth. అంటే చిన్న గాజు పెంకంత-ఏదో ఒకటి చెప్పు చిన్న పిసరంత పోనీ...

### అసంతృప్తులు లేని జీవితం

ఎలాంటి బాదరబందీలేని జీవితం. నలుగురు



కస్టమ్స్ శాఖలో అధికారిగా...

ఆడపిల్లలు. ముగ్గురు హైదరాబాదే! ఒక అమ్మాయి నాసిక్‌లో వుంటోంది. నాల్గవతరాన్ని కూడా చూశాను. అంటే ముని మనవరాలు కూడా వుంది. పరిపూర్ణమయిన జీవితం భగవంతుడు నాకిచ్చాడు. ఆ సంగతి తెలుసుకున్న అదృష్టం నాకుంది. రోజూ మూడు దిన పత్రికలు చదవటం, క్రాస్ వరల్డ్ పజిల్స్ చేయటం, 2, 3 గంటలు నెట్ విహారంలో గడపటం ఇదీ నా దినచర్య. అనుకూలించే ఇల్లాలు స్వరలక్ష్మి.

### తీయని జ్ఞాపకాలు

ఆగ్రాలో వున్నప్పుడు చైనాతో భారత్ యుద్ధం జరిగిన సమయమది. ఆ సమయంలో ప్రముఖ హిందీ గాయకులు సైనిక సోదరుల కోసం ఒక పెద్ద ప్రోగ్రాం ఇచ్చారు. నగరంలో వున్న సీనియర్ ఆఫీసర్లలో నేనొక్కడిని కాబట్టి రఫీని కలిసి కరచాలనం చేసే అదృష్టం దక్కింది. అదో తీపి జ్ఞాపకం.

**-సి. యస్. రాంబాబు**

నాకు నచ్చిన
నా కథ

# తెరవెనక కోకిల

- ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సుజాతకు నామీద కోపం వచ్చి వారం రోజులు అయింది. ఆమె ఢిల్లీ వెళ్ళిపోయి ఏడు రోజులయింది. వెడుతూ కారు తీసుకు వెళ్ళిపోయింది. ఇప్పటికీ పంపలేదు.

ఆమె టెలిఫోన్ చెయ్యలేదు.

సుజాతకు, నాకు పోట్లాట రావడంలో ఏమీ విచిత్రం లేదు. రెండు మూడు రోజులు శాంతంగా గడిచిపోతే ఏదో వింతగా, వెలితిగా ఉండేది. అందుచేత ఆమెను ఏదో అంటేనో, ఆమె ఏదో అంటేనో కలహం వచ్చేది.

ఇప్పటిదాకా ఆమె కనీసం - ఈ సంవత్సరంలో పదిసార్లు వాళ్ళ అన్న గారి ఇంటికి వెళ్ళిపోయింది దెబ్బలాడి.

కాని, వెళ్ళిన ఇరవై నాలుగు గంటల్లో టెలిఫోన్ వచ్చేది.

"…. నమస్తేజీ!"

నేను కొంచెం ఆలోచనలు దారిలో పెట్టే లోపలే సుజాత తన వివరాలన్నీ చెప్పి, "రాత్రి భోజనం బాగా చేశారా?" అని అడిగేది.

"ఆ…"

"నేనుంటేనే మీకు వంటవాడు చేసిన వంట నచ్చదు. ఏం?"

"కాదు. నిన్నరాత్రి క్వాలిటీలో తిన్నాను".

"గాడ్! పాపం!…. నేను వచ్చేస్తానులెండి… శుక్రవారం గ్రాండ్ ట్రంక్‌లో.."

ఇంక నేనేమీ అనకపోతే ఆమె శుక్రవారం వచ్చేసేది. అనేక కథల్లో వ్రాసినట్లు కాళ్ళు పట్టుకునో, కౌగిలించుకునో, కన్నీళ్ళు కారుస్తూ నో - ఏమిటి లాభం! ఆమెలో ఆ రకం 'స్త్రీత్వం' లేదు. స్టేషన్‌లో దిగగానే, "సారీ - చాలారోజులు ఒంటరిగా ఉందాం అని ఆశపడ్డారా?" అని పలకరించేది.

ఒకసారి ఆమె స్వయంగా వంట చేసింది. ఆ వేళ ఏదో పనిమీద అలిగఢ్ వెళ్ళి అక్కడే భోజనం చేసి వచ్చాను రాత్రి తొమ్మిదిన్నరకు.

"భోజనానికి లేవండి" అంది సుజాత.

"అలిగఢ్‌లో చేసేశాను" అన్నాను.

కోపంగా చూసి, "నేను వంట చేశాననా?" అంది.

"కాదు. అక్కడ కుమార్ బలవంతం చేశాడు. ఆకలీవేసి ఏడుకల్లా-"

"వంట ఎవరు చేశారు? సుశీలా?"

"అనుకుంటాను. కుమార్‌కు వంట రాదు. వాళ్ళకు వంట మనిషి లేదు".

"చాలా బాగుంది".

వెంటనే సుజాత వెళ్ళి గడియ పెట్టుకుని పడుకుంది.

అరగంట దాకా కూర్చుని, సిగరెట్లు కాల్చుకుని, గదులు తాళం వేసి మీదకు వెళ్ళి బెడ్ రూమ్ తలుపు తట్టాను.

"తియ్యను" అంది సుజాత.

"నా నైట్ సూట్ అక్కడ ఉంది" అన్నాను.

"తెలుసును"

"పోనీ ఇవతల పడేయ్".

"పడెయ్యను!"

కిందకు వచ్చి మళ్ళా లైటు వేసి కోటు విప్పి హీటర్ పెట్టుకుని సోఫాలో పడుకున్నాను. చలికొరికేస్తూంది, వేడి తగలని వేపు. కర్టెన్లు విప్పి కప్పు కున్నాను. నిద్ర పట్టేసింది. మా సోఫాలు చాలా బాగుంటాయి. కర్టెన్లు సుజాత పెళ్ళిలో ఇచ్చినవి, టాపెస్ట్రీ.

పన్నెండు దాటి ఉంటుంది.

ఎవరో లేపినట్టు అయితే లేచాను. సుజాత.

"ఏం కావాలి?"

"తాళాలు"

"ఏ తాళాలు?"

"డైనింగ్ రూమువి"

"ఏం? చప్పుడు అవుతూందా?"

"ఆఁ.. నా కడుపులో ఆకలి" .

లేచి తీసి ఇచ్చాను. ఆమె వెళ్ళిన తరువాత మీదకు వెళ్ళాను. బట్టలు మార్చుకుని రగ్గు తెచ్చుకుందామని.

బెడ్ రూముకు తాళం వేసి ఉంది.

నిశ్శబ్దంగా కిందకువచ్చాను. ఆమెకు కోపం వచ్చినప్పుడు తల మరీ బాగా పని చేస్తుంది.

నిద్ర రావడం లేదు. సిగరెట్ వెలిగించి కుమార్‌నూ, సుశీలనూ తలచుకుని ఆలోచించసాగాను. నేను చేసిన తప్పు ఏమిటని.

సుజాతకు చిన్నచిన్న ఈర్ష్యలూ, అనుమానాలూ సామాన్యం కావు. రాత్రి ఏడు గంటలకు నాకు ఆకలి అని ఆమెకు తెలుసును.

నేనేం చేశాను?

ఆమె భోజనం ముగించి వచ్చింది. అడిగాను.

"నేను చేసిన తప్పు ఏమిటి?"

ఎదురుగా కూర్చుని - "సుశీల వంట బాగుంది అని అనడం, అబద్ధం" అంది.

హీటర్ వేడికి ఆమె అడ్డు. చలి వేస్తూంది.

"శిక్ష చాలా?" అన్నాను.

"చాలదు".


ఆమె లేచి వెళ్ళిపోయి గడియ పెట్టుకుని నిద్రపోయింది.

మర్నాడు ఉదయం టీ తెచ్చి లేపింది. మా సోఫాలు ఎంత మంచివైనా ఒళ్ళు నొప్పి…

"ఇవాళ నువ్వు వేగం లేచావు" అన్నాను టీ తీసుకుంటూ.

"ఆ. మీ బాధ చూస్తేకాని సరదా తీరక, చీకటి తోనే లేచాను" అంది.

ఇంకేమీ అనలేదు నేను, లాభం లేదని తెలిసి.



ఇలాంటి మధురానుభూతులతో సుమారు ఒక సంవత్సరం గడిచి పోయింది. క్రిందటి వారం వరకూ.

ఆవేళ అన్ని రోజులలాగే తెల్లారింది, వర్షంతో రొజగాలితో లేచేసరికి వంటమ నిషి టీ తెచ్చి ఇచ్చాడు. గడ్డం గీసుకుని స్నానం చేసేవరకూ సుజాత నన్ను చూడదు, చూస్తే పీడకలలు వస్తాయని.

ఆరు గంటలు కాబోలు అయింది. టెలిఫోన్ గంట వినిపించి దిగాను. ఇంకా నిత్యకృత్యాలు తీరలేదు. సుజాత టెలిఫోన్ రిసీవరు తీసి, ''ఆయనే వస్తున్నారు'' అని ఒక భయంకరమైన వీక్షణ నా మీద సారించి, ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది. సుందర నా రూపం చూసి కాబోలు అనుకుని రిసీవర్ తీసుకున్నాను.

''హల్లో!'' అనేసరికి సుజాత కోపానికి కారణం తెలిసింది – కొంతకాలం కింద నేను పెళ్ళి చేసుకుంటానని అనుకున్న సులేఖ, ప్రస్తుతం సులేఖా ఛటర్జీ.

''ఢిల్లీ నుంచి వెడుతూ తాజ్ చూసి పోదామని వచ్చాను. దిగేసరికి వాన. టాక్సీలు లేవు''.

''అక్కడే ఉండండి. నేను వస్తాను''

సులేఖను గురించి చాలా చెప్పవలసి ఉంది. కాని, ఈ సందర్భంలో కొంచెం చాలు. ఆ రోజుల్లో ఆమె చాలా అందంగా ఉండేది. నాకు బెంగాలీ భాష అంటే ఇష్టం. బహుశా బెంగాలీలు కూడా అంత మధురం గాను ఉంటారనుకున్నాను. అప్పుడు కలకత్తాలో ఉండేవాణ్ణి. చాలా కథల తరువాత, ''సులేఖా! నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అని అడిగాను.

బాగా జ్ఞాపకం, ఏ ఇంగ్లీషు సినిమాకో వెళ్ళి రిట్జ్‌లో డిన్నర్ తిని వస్తుంటే టాక్సీ హౌరా బ్రిడ్జి దగ్గిర ఒక నిమిషం ఆగిపోయింది. ఆ నిమిషంలో...

''సారీ, జగన్! బేణూ ఛటర్జీ ఈ సాయంత్రం అడిగితే అలాగేనన్నాను. అదీకాక ఇంకా నువ్వు లక్షాధికారివి కావుగా!'' అంది.

టాక్సీ కదిలిపోయింది. ''సునంద జపాన్ వెడుతుందిట. ట్రాన్సిస్టర్ తెమ్మని చెప్తావా?'' అంది.

''చెప్పను'' అన్నాను.

''కోపంగా ఉన్నావా? ముద్దు పెట్టుకోనా?'' అంది.

''వద్దు'' అన్నాను. ఆమె వాడే లిప్‌స్టిక్ రంగు నాకు ఎన్నడూ నచ్చలేదు.

ఆ తరువాత మరో రెండు నెలలు అప్పుడప్పుడు కలుసుకుంటూనే ఉన్నా, మళ్ళీ నా ప్రేమ విజృంభిం చలేదు. భారతదేశపు రోడ్ల మీద గతుకులాగ ఆ వ్యవ హారం త్వరగానే మరచిపోగలిగాను. తరవాత నేను ఆగ్రా రావడం, సుజాత – అది వేరే కథ – ఇప్పటిది.

పది నిమిషాల్లో బట్టలు వేసుకుని కారు తీసుకుని ఏరోడ్రోమ్‌కు వెళ్లాను. అప్పటికి కొంతవర్షం తగ్గింది. సివిల్ ఏరోడ్రోమ్ పక్కన అయిదారు టాక్సీలు ఉన్నాయి. లాంజ్‌లోకి వెళ్లాను.

టీ తాగుతూ కూర్చుంది సులేఖ. ముందుగా పోల్చలేకపోయాను.

''హల్లో, జగన్!''

ఆ గొంతుకను బట్టి పోల్చాను సులేఖను. ఈ మూడు సంవత్సరాలలోను కనీసం ముప్ఫయి కిలో గ్రాముల అదనపు సులేఖ కనపడుతూంది.

కూర్చున్నాను. కొద్ది క్షణాలు ఆలోచనలు చాలా గడబిడగా సాగాయి.

నా తత్తరపాటు గమనించి, ''పోల్చలేక పోయారా? అప్పటిలాగ నీరసం లేదు ఇప్పుడు. కొంచెం మారాను'' అంది సులేఖ.

''అవునవును'' అన్నాను ఇంకో టీ తెమ్మని బేరర్‌తో చెప్పి.

నా ఆలోచనలు అప్పటికి ఒకస్థాయిలో పడ్డాయి. సులేఖ కోసం నేను నిద్ర రాని రాత్రులు గడపలేదు కాని టీ అక్కర్లేదన్నట్లు నన్ను విదిలించడం నా ఆత్మగౌరవానికి నాకు తెలీని గాయం కలిగించిందనుకుంటాను. ఆ కొత్త కిలో గ్రాములు ముప్ఫయ్యీ నా నిరాశ చాలావరకు మాయం చేశాయి. సుజాత ఎన్నడూ అలాగ అవదు.

''మీ ప్రోగ్రాం ఏమిటి?''

''ఫతేపూర్ సిక్రీ, ఫోర్టు, ఇత్మదుద్దౌలా చూసి సాయంత్రం తాజ్ చూసి రాత్రి బయలుదేరి మళ్లీ ఢిల్లీ''.

''ఢిల్లీకి నాలుగున్నరకు వెడుతుంది ప్లేన్'' అన్నాను.

''బేణు వస్తారు. కారుమీద. ఆయనకు ఏదో మినిస్ట్రీలో పని ఉంది. ముగించి నాలుగు గంటలకు వచ్చి నన్ను తీసుకెడతారు''.

భగవాన్! అనుకున్నాను. ఈ వర్షం ఉదయం అంతా మరీ అసహ్యంగా ఉంది. ఈ రోజంతా...

ఆమె కోరిన ప్రకారం క్లార్క్స్ షిరాజ్‌లో గది తీసుకున్నాను. ఆమె బ్రేక్ ఫాస్ట్, మూడు ఎగ్గ్సూ, నాలుగు టోస్టులూ, ఏపిల్, ఆరెంజ్ ముగించి, ''ముందర ఫతే పూర్ సిక్రి చూద్దాం పదండి'' అంది.

ఇంటి నంబరు రింగ్ చేశాను. జవాబు రాలేదు. ఆఫీసుకు వార్త పంపించి కారు హోటల్లో వదిలి టాక్సీలో బయలుదేరాను.

తిరిగివచ్చి లంచి ముగించి ఫోర్టూ, ఇత్మదుద్దౌలా చూసి తాజ్‌కు వెళ్లాము. ఆమె మరీ అలసిపోయింది. ఉదయం ఫతేపూర్ సిక్రిలో తిరగడం, తరువాత ఫోర్టూ...

ఫోర్టులో ఎక్కవలసిన మెట్లు చూసి, ''వద్దు... పద... తిరిగి వెడదాం'' అంది.

బలవంతం చేసి అన్నీ తిప్పాను – పెరల్ మసీదుతో సహా. తాజ్ పచ్చిక మైదా నంలో కూర్చుని, ఇంక లేవను'' అంది ఆయాసంగా.

గంట తరువాత మెట్లు ఎక్కలేక తాజ్‌ను బయటనుంచే చూసి, హోటల్‌కు వెళ్లాము. టాక్సీ బిల్లు ఏభై ఎనిమిది. ఆమె కళ్లు తెరిచే స్థితిలో లేదు. చెల్లించిలోనికి వెళ్లేసరికి బేణుఛటర్జీ వచ్చి, ''నీ కోసం గంట నుంచి ఆదుర్దాగా చూస్తున్నాను'' అని నన్ను పలకరించి, ''అలా ఉన్నావేం?'' అన్నాడు సులేఖను.

''అలసిపోయాను, తిరిగి''.

అతను మరీ బాధపడిపోయాడు. ఆమెను తీసుకెళ్ళి రూములో వదిలి వచ్చి, ''ఇన్ని లిఫ్టులున్నాయి కనక బతికాం'' అన్నాడు కూర్చుని.



అవీ, ఇవీ మాట్లాడుకుని మళ్లీ సులేఖను కలుసుకోకుండానే వెళ్లి పోయాను. ఆఫీసు నుంచి ఫోన్ చేశాను. సమాధానం లేదు.

ఏడు గంటల దాకా కూర్చుని పని ముగించి క్వాలిటీలో బరువుగా టీ తాగి తొమ్మిదికి ఇంటికి వెళ్లాను.

ఎన్నిచెడ్డ గుణాలు ఉన్నా సుజాత పిలవగానే తలుపు తీస్తుంది. లోనికి వెళ్లి ''టెలిఫోన్ చేస్తే తియ్యలేదేం?'' అన్నాను లాలనగా.

''నా ఇష్టం!'' అంది.

ఈవేళ కలహం తేవడం నాకిష్టం లేదు – ముఖ్యంగా నేరం నాది కనక.

బట్టలు మార్చుకుని మంచం మీద పడుకుని ఏదో నవల తీసుకున్నాను.

సుజాత వచ్చి పక్క మంచం మీద పడుకుని చదువుతూంది.

గంట... గంటన్నర...

బయట పెద్దవర్షం మళ్లా ప్రారంభం అయింది. ఉరుములు, మెరుపులు.

సుజాతకు ఉరుములు, మెరుపులు అంటే చాలా భయం.

పది నిమిషాల్లో అయిదుసార్లు పోయి ఆ తరువాత దీపాలన్నీ పోయాయి శాశ్వతంగా.

పుస్తకం కింద పడేసి కళ్లు మూసుకున్నాను. అలిసిపోయిన శరీరానికి నిద్ర పట్టేసింది.

బహుశా పావుగంట అయి ఉంటుంది. పెద్దపిడుగు పడింది. మరునాడు తెలిసింది. మా ఇంటికి ఒక మైలు దూరంలోనని.

ఆమె చేతుల ఒత్తిడికి తెలివి వచ్చింది. సుజాత భయంతో కొంచెం వణుకుతూంది.

ఇంకో గంటవరకూ బీభత్సం సాగింది. ఆమె చాలా దగ్గిరగా నన్ను పట్టుకుని, ముఖం దిండులో దాచుకుంది.

వర్షం తగ్గింది. మళ్లీ అంతా ప్రశాంతం అయిపోయింది.

ఆమె జరిగి వెళ్లబోయింది.

చెయ్యి అడ్డుపెట్టేను. ''ప్రేమకోసం కౌగలించలేదు. మిమ్మల్ని.. వర్షం తగ్గింది. ఇంక మీరు దూరంగా జరిగి పడుకోండి'' అంది సుజాత.

భగవాన్ దయవల్ల ఆరోజు వర్షం లేకపోతే డ్రాయింగ్ రూమ్‌లోనే పడుకుని

### నాకీ కథ ఎందుకు నచ్చిందంటే



మంచిగొంతు విన్నప్పుడు ఆ గొంతు కలిగిన వ్యక్తి అందంగా వుంటారని అనుకుంటాం. అదే నిజజీవితంలో జరిగితే ఎలా వుంటుందన్న పాయింట్ ఆధారంగా రాసిన కథ ఇది. అందుకే నచ్చింది.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

**9948896609**

ఉండేవాడి నన్నమాట!

***

మరునాడు ఉదయం ఏడున్నరకు ఢిల్లీ నుంచి వచ్చిన వాళ్ల అన్నయ్య డ్రైవరు ప్రత్యక్షం అయ్యాడు.

ఎనిమిది గంటల పదకొండు నిమిషాలకు నా కారు బయటికి వెడుతూన్న శబ్దం, రేడియో నాటకంలో లాగ!

ఎనిమిది గంటల పన్నెండు నిమిషాలకు భవదీయుడు కారు లేని, భార్య లేని ఏకాకి...

ఆ నాటినుంచి ఈ వారమూ అలాగే గడిచింది. కనీసం కార్డైనా రాలేదు. ఆమె జాడ తెలీదు.

***

ఢిల్లీ నంబరు చూసుకుని డయల్ చేశాను. టెలిఫోన్ వాళ్ల ధర్మమా అని ఈ సౌకర్యం చేసి పెట్టారు. మా సంభాషణ ఎక్స్ఛేంజి వాళ్లు వినక్కర లేదు.

అదృష్టం కొద్దీ సుజాత తీసింది రిసీవరు.

''సుజాత! నువ్వు రాలేదు. అదే కష్టంగా ఉంది. దానికి తోడు కారు కూడా...''

''సారీ! మరచిపోయాను.... పంపమంటారా?''

''థాంక్స్! నువ్వే తేకూడదూ?''

''క్షమాపణ చెబుతారా?''

''క్షమించు – క్షమించు – క్షమించు–''

''క్షమించాను''.

''ఇంతకూ ఈసారి నేరం ఏమిటి?''

''అది తరవాత చెబుతాను. భోజనం చేసి బయలుదేరతాను''.

రిసీవర్ పెట్టేసింది.

నిర్ఘాంతపోయాను, ఇంత సుళువుగా అంగీకరించిందేమిటని.

వింతలు జరుగుతూనే ఉంటాయిలే అనుకుని సరిపెట్టుకున్నాను.

ఆమె వచ్చేసరికి ఆరున్నర అయింది.

మా కలహాల తరువాత ప్రేమ దృశ్యాలూ, కన్నీళ్లూ ఉండవు. ఏమీ జరగనట్లే ఆమె వంట మనిషికి ఆర్డర్లు ఇచ్చి స్నానం చేసి వచ్చింది.

''మీ నేరం ఏమిటో తెలిసిందా?''

''లేదు''

''సులేఖ... నిన్న బ్రదర్ ఆమెను తీసుకువచ్చాడు డిన్నర్‌కు...''

''...............''

''ఆమె గొంతుక విని, ఎంతో అందంగా ఉంటుందనీ, మీరు మరిచి పోయిన ప్రణయ గాథలన్నీ–''

''ఒకటే. గాథ'లు కావు''.

''పోనీ, అదే మొదలు పెడతారనీ అనుకున్నాను''

''..........................''

''ఆమె విగ్రహం చూడగానే సగం బాధ పోయింది నాకు. తరవాత...''

''ఆ!''

''ఆరోజు మీరు ఆమెను ఫతేపూర్ సిక్రిలోనూ, ఫోర్ట్ లోనూ బలవంత పెట్టి తిప్పేరుట. చాలాకోపంగా చెప్పింది....''

''...............''

''జన్మలో ఆ కోపం పోదు ఆవిడకు. ఆవిడ బరువు తెలుసునా?''

''నూట అరవై, డెబ్భై–''

''గుడ్ – నూట డెబ్భై అయిదు''.

''ఇంతకూ నేనేం చేశాను?''

''ఆ సాయంత్రం ఆమెను నాకు ఎందుకు చూపెట్టలేదు? కనీసం ఆమె స్వరూపాన్ని వర్ణించలేదెందుచేత? ఆమె గొంతుక–''

''చాలా బాగుంటుంది కదూ?''

సుజాత వచ్చి నా పక్కన కూర్చుంది, సిగరెట్ కేస్ తెరిచి అందిస్తూ. ''అవును... చాలా బాగుంటుంది. దానికి తగిన రూపం ఉంటే..''

కలకంటూన్నట్లు చూస్తుంది సుజాత.

సిగరెట్ వెలిగించుకుని కష్టంగా ఆమె కళ్ల నుంచి నా దృష్టి మరల్చు కున్నాను.

*